## క్లుప్తంగా

### పుట్టాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పుట్టాలమ్మ

ఆళ్లగడ్డ: మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవుదినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టాలమ్మ, శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, లక్ష్మీనరసింహ స్వామి, పార్వతీదేవిని దర్శించుకున్నారు. పుట్టాలమ్మకు పాలు, పండ్లు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

**భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు**

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పలువరు మహిళలు అమ్మవారికి గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### అలరించిన సంప్రదాయ నృత్యం


సంప్రదాయ నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై శ్రీలక్ష్మీ నరసింహస్వామి మ్యూజికల్ డాన్స్ అకాడమీ, హైదరాబాద్ వారి సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమములో గణపతి ప్రార్థన, మూషికవాహన, శివతాండవం, శివాష్టకం, బిల్వాష్టకం, లింగాష్టకం, శంకరా శశిధర, బాలత్రిపుర సుందరి తదితర అష్టకాలకు, గీతాలకు జి.గాయత్రి, పి.సాయివిధాత్రి, సి. సునంద, టి.భువనేశ్వరి, ఎం.తన్మయిశ్రీ, సి.స్వాతి, డి.సురభి, ఎం.స్వాతినాగలక్ష్మీ, ఆర్.గీతవాణి, పి.పల్లవి తదితరులు నత్యం చేశారు.

### క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు


విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): క్రమశిక్షణ, పట్టుదలతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగవచ్చని పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ల సుదర్శనం శెట్టి, వాయిస్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. చదువుకు పేదరికం అడ్డురాకూడదని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. స్థానిక సంఘమిత్ర సమావేశ భవనంలో ఆదివారం మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన వారికి ఒక్కొక్కరికి రూ.1,100 నగదు, మెమొంటో అందజేసి సన్మానించారు. వారు మాట్లాడుతూ 21మండలాల నుంచి వచ్చిన మండల టాపర్లను నగదు పురస్కారాలతో సన్మానించామని చెప్పారు. ప్రమోద్, సుందర్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

### వనరులను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు అందుబాటులోనున్న వనరులను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బలిజ కాపు సేవా సమితి వ్యవస్థాపకులు దండె దస్తగిరి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఇటీవల పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు అందజేశారు. అధ్యక్షుడు కొప్పుల సుబ్బారెడ్డి మాట్లాడుతూ జంబులన్న ట్రస్టు ద్వారా వర్ధం శెట్టి రాజారాం దంపతుల సహకారంతో వెదుర్ల రామచంద్రారావు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, సుంకన్న, మాజీ కౌన్సిలర్ కూరాకు రవి ఆర్థిక సహకారంతో 70మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశామని చెప్పారు. నరేష్, ప్రసాద్, శ్రీనివాసులు, రాజశేఖర్, ఆదినారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

### అ'పూర్వ' సమ్మేళనం

వెలుగోడు: దాదాపు 18 ఏళ్ల తరువాత నాడు కలిసి చదువుకున్న విద్యార్థులంతా చదువులమ్మ ఒడిలో మరోసారి కలిశారు. ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో జీవితంలో స్థిరపడిన వారంతా కలిసి నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. రేగడగూడురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2006–2007 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా మృతిచెందిన మిత్రులకు సంతాపం తెలిపారు. చివరగా నాటి గురువులను సత్కరించారు. హెచ్ఎం అబ్దుల్ ఖాదర్, లక్ష్మీకుమారి, రఘునాథ్ రెడ్డి, బసిరెడ్డి, షణ్ముఖ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, ఆచారి,భాస్కర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# ఆఖిరి ఘట్టానికి సిద్ధం

- కౌంటింగ్‌కు మిగిలింది 24 గంటలే..
- సిబ్బందికి రెండు సార్లు శిక్షణ
- పకడ్బందీ ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నం
- భారీ పోలీస్ బందోబస్తు
- 2019 ఫలితాలే ప్రతిబింబిస్తాయని వైఎస్సార్‌సీపీ ధీమా
- దింపుడు కల్లం ఆశలతో టీడీపీ


ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది (ఫైల్)

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. ఈవీఎంలలో నేతల భవితవ్యం నిక్షిప్తమైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా స్వల్పంగా పెరిగిన పోలింగ్ సరళి అటు అభ్యర్థులను, ఇటు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కౌంటింగ్‌కు మరో 24 గంటల ఉండటంతో నరాలు తెగే ఉత్కంఠ, ఊపిరి సలపని టెన్షన్ పెరుగుతోంది. ఓటింగ్ శాతం పెరగడం.. బారులుదీరి ఎండలో నిలబడి ఓట్లు వేయడం సంక్షేమానికి మద్దతు తెలిపారని వైఎస్సార్‌సీపీ స్పష్టం చేస్తుండగా.. ఇది తమ కొంప ముంచేలా ఉందని టీడీపీ మదన పడుతోంది. ఈ తరుణంలో ఈ ఎన్నికలూ ఏకపక్షమనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

**24 గంటలే..**

ఎన్నికల లెక్కింపు సమయం దగ్గర పడుతోంది. మరో 24 గంటల్లో ఓట్లను లెక్కించనున్నారు. ఇందుకోసం ఎన్నికల యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడిన అనంతరం నియోజవర్గంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పోలింగ్ రోజు అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించడం వంటి స్వల్ప ఇబ్బందులు చోటు చేసుకున్నాయి. ఇదంతా కొందరు అధికారులు, సిబ్బందికి అవగాహన లేకపోవడంతోనే ఇబ్బందులు తలెత్తాయని అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. లెక్కింపులో ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. లెక్కింపు ప్రక్రియపై కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి రెండుసార్లు శిక్షణ ఇచ్చారు. ఎలా లెక్కించాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, లెక్కింపు పూర్తయిన మిషన్లను ఎలా సీల్‌వేయాలి, ఎక్కడ భద్రపరచాలి, వీవీ ప్యాట్‌లు ఎలా లెక్కించాలి, ఎన్ని లెక్కించాలనే అంశాలపై ఒకటికి రెండు సార్లు అవగాహన కల్పించారు. మరో వైపు పోలీస్ యంత్రాంగం కూడా సిద్ధమైంది. ఎన్నికల ఫలితాలను ప్రకటించేటప్పుడు శాంతిభద్రతల సమస్య తలెత్తితే తీసుకోవలిసిన భద్రతపై పోలీసులు దృష్టి పెట్టారు. జిల్లాలో అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా గుర్తించి అందుకు అనుగుణంగా పోలీస్ బలగాలను కేటాయించారు.

**ప్రధాన పార్టీల మధ్య పోటీ..**

ఆళ్లగడ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీ అభ్యర్థుల మధ్యే పోటీ నడిచింది. వైఎస్సార్‌సీపీ తరపున గంగుల బిజేంద్రారెడ్డి, టీడీపీ నుంచి భూమా అఖిలప్రియ మరోసారి తలపడ్డారు. మిగిలిన గుర్తింపు పొందిన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నలిచినప్పటికీ నామమాత్రమనే చెప్పాలి.


ఆళ్లగడ్డ నియోజకవర్గ మ్యాప్

**వైఎస్సార్‌సీపీలో జోష్..**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపు నల్లేరుమీద నడకే అనే ధీమా వ్యక్తమవుతోంది. దీనికి తోడు సర్వే ఫలితాలు వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది. ఇంతవరకు అంతో ఇంతో ధీమాగా ఉన్న టీడీపీ శ్రేణులు ఒక్కసారిగా డీలా పడినట్టు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మొన్నటి వరకు కేవలం గెలుపులపైనే బెట్టింగ్ రావాలని చాలెంజ్ చేసిన టీడీపీ శ్రేణులు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ మెజార్టీపై బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి.

**ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల వివరాలు**

| | |
|---|---|
| అసెంబ్లీ నియోజకవర్గం | : ఆళ్లగడ్డ |
| ఓట్ల లెక్కింపు కేంద్రం | : ఆర్జీఎం కళాశాల నంద్యాల |
| అసెంబ్లీ నియోజకవర్గానికి | : 10 టేబుళ్లు |
| పార్లమెంటు నియోజకవర్గానికి | :10 టేబుళ్లు |
| అసెంబ్లీ సర్వీస్ ఓట్లు, | |
| పోస్టల్ బ్యాలెట్లకు | : 3 టేబుళ్లు |
| మొత్తం టేబుళ్లు | :14 |
| కౌంటింగ్ సిబ్బంది | : 84 మంది |
| (అసెంబ్లీ, పార్లమెంట్‌లకు టేబుల్‌కు ముగ్గురు) | |
| మైక్రో అబ్జర్వర్లు | :24 మంది |
| అదనపు సిబ్బంది | :నలుగురు |
| లైన్ సూపర్‌వైజర్లు | :నలుగురు |
| లైన్ ఆఫీసర్లు | :ఐదుగురు |
| ఐటీ సిబ్బంది | :ఆరు గురు |
| లెక్కింపు అనంతరం సీలింగ్‌కు | : 20 మంది సిబ్బంది, ఇద్దరు సూపర్‌వైజర్లు |
| రెండు స్ట్రాంగ్ రూంలకు ఇన్‌చార్జులు | :8 మంది |
| మీడియా లైజనింగ్ ఆఫీసర్ | : ఒకరు |
| ఈవీఎంలు తరలించడానికి | : 20 మందితో బృందం, నలుగురు సిబ్బంది |
| పోలీస్ బందోబస్తు | :సుమారు 160 |
| కౌంటింగ్ ఏజెంట్లు | :సుమారు 120 |
| మొత్తం రౌండ్లు | |
| అసెంబ్లీ | : 22 |
| పార్లమెంట్ | : 22 |
| వీవీ ప్యాట్ల లెక్కింపు అసెంబ్లీకి | : 5 |
| పార్లమెంట్‌కు | : 5 |

### మాతృభాష, సంస్కృతిని కాపాడుకోవాలి



సమావేశంలో పాల్గొన్న అతిథులు

నంద్యాల(న్యూటౌన్): మాతృభాష, మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని డాక్టర్ గెలివి సహదేవుడు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని 18 రోజుల పాటు జరిగిన ఆచార్య ప్రశిక్షణ వర్గ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ప్రొఫెసర్ గొల్లపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు బోధించి ఉన్నత స్థితికి ఎదుగేందుకు తోడ్పడాలని సూచించారు. ఎద్దుల మహేశ్వరరెడ్డి,కన్నభాస్కర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### బెల్ట్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ


బెల్ట్ పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా షైట్యు స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీశైలం హైస్కూల్‌లో బెల్ట్ పరీక్ష, టెక్నికల్ సెమినార్ ఆదివారం నిర్వహించారు. ఈ బెల్ట్ పరీక్షలో ఐదుగురు ఎల్లో బెల్ట్, ఐదు ఆరెంజ్ బెల్ట్, 30 మందికి గ్రీన్ బెల్ట్‌లు, 5 బ్రౌన్ బెల్ట్, ఒకరికి బ్లాక్ బెల్ట్ ప్రదానం చేశామని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహాన్ షేక్ నూర్‌బాషా తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ ద్వారా క్రమశిక్షణ అలవడుతుందన్నారు.

### ప్రశాంతంగా ఉండండి


పెద్దకంబలూరులో ప్రజలకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ కుమారస్వామి

రుద్రవరం: ఎన్నికల లెక్కింపు రోజున గొడవలకు పోకుండా అందరు ప్రశాంతంగా ఉండాలని డీఎస్పీ కుమారస్వామి అన్నారు. మండలంలోని కోటకొండ, ఎల్లావత్తుల, డీ.కొట్టాల, శ్రీరంగాపురం,పెద్దకంబలూరు గ్రామాల్లో ఆదివారం ప్రజలు,రౌడీ షీటర్లకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయని ఆ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకూడదని చెప్పారు. 144 సెక్షన్,30 పోలీస్ చట్టం అమల్లో ఉంటుందని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే గెలుపు వర్గీయులు సంబరాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఉన్నారు. అలాగే శిరివెళ్ల సీఐ చంద్రబాబు మండల కేంద్రం రుద్రవరం సెంటర్‌లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం నుంచి దుకాణాలు మూసివేయాలని యజమానులకు ఆదేశించారు.


చిన్నకంబలూరు అంకిరెడ్డి చెరువు కట్టను తవ్విన దృశ్యం

## చెరువుకట్ట ధ్వంసం

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరు గ్రామానికి చెందిన అంకిరెడ్డి చెరువు కట్టను కొందరు దుండగులు ధ్వంసం చేస్తున్నారు. రాత్రిళ్లు గుట్టు చప్పుడు కాకుండా జేసీబీల సాయంతో కట్టను తవ్వి ఆ మట్టిని ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం తెల్లవారుజామున అంకిరెడ్డి చెరువు కట్టను తవ్వి రెండు ట్రాక్టర్లు మట్టిని తరలిస్తుండగా పోలీసులు అటు వైపు రావటాన్ని గమనించి దుండగులు మట్టిని అక్కడే వదిలేసి పొలాల్లో నుంచి పారుపోయారని చెరువు పరిధిలోని ఆయకట్టు రైతులు తెలిపారు. తవ్వకాల వల్ల చెరువులో నీటి నిల్వ అధికమైనప్పుడు లీకేజీలు,గండి పడే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి దుండగులపై కేసులు నమోదు చేయించాలని కోరారు. ఈ విషయంపై ఎంఐ ఏఈ మునాఫ్‌ను వివరణ కోరగా గతంలో కూడా కొన్ని చెరువుల కట్టలను తవ్వారని అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేశామని, ప్రస్తుతం అంకిరెడ్డి చెరువు కట్ట తవ్వారని తెలిసిందని, పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## పోలీస్ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయండి


కొండమనాయునిపల్లెలో పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

అవుకు: సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ఈ నెల 4న నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే ఏ మాత్రం ఉపేక్షించొద్దని ఆదేశించారు. మండల పరిధిలోని కొండమనాయునిపల్లెలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్‌ను జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. గ్రామ ప్రజల పరిస్థితులపై ఎస్పీ ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వివాదాలకు దూరంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ నేపథ్యంలో విజయోత్సవ సంబరాలు నిషేధమని, ఆ దిశగా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. పోలీసుల నిబంధనలు ఉల్లంఘించినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వ్యక్తులను ఏ మాత్రం ఉపేక్షించొద్దని, కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ తిమ్మారెడ్డి, స్థానిక ఎస్ఐ కిరణ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ హరినాథ్ రెడ్డి, కానిస్టేబుల్ ఉశేన్ పాల్గొన్నారు.

### వాల్మీకి గుహల సందర్శన

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లి సమీపంలో వెలసిన వాల్మీకి గుహలను ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎలక్షన్ కౌంటింగ్ అబ్జర్వర్ ఎ. దినేశ్ కుమార్, ఉద్యానశాఖ జిల్లా అధికారి నాగరాజు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు గుహల అందాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సహజసిద్ధంగా వెలసిన వాల్మీకి గుహలు అద్భుతంగా ఉన్నాయన్నారు. గుహల పైభాగంలో వేలాడే శిలాజాకృతులు, శివలింగం, నంది ఆకృతి చూసి మధురానుభూతి పొందినట్లు తెలిపారు. వారితో పాటు ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, వీఆర్ఓ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

## సారూ.. సమస్య పరిష్కరించండి!


రామచంద్రాపురంలో ఓ గుడిసెలోకి చేరిన వర్షపునీరు

దొర్నిపాడు: నాలుగేళ్లుగా వర్షం కురిసినప్పుడల్లా ఓ గుడిసె ఇలా నీటిమయం అవుతుంది. మండలంలో రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం కురిసిన వర్షానికి నీరంతా గుడిసెలోకి చేరడంతో సరళ అనే మహిళ ఆందోళన చెందుతోంది. దిగువ ప్రాంతంలో ఉన్న ఓ ఇంటి వారు కాలువకు అడ్డుగా ర్యాంప్ ఏర్పాటు చేయడంతో మురుగునీరు వెళ్లే పైపు పూడిపోయింది. దీంతో దిగువకు వెళ్లాల్సిన నీరు ఎగువ ఉన్న ఆ ఇంట్లోకి చేరుతుంది. దీంతో వారికి వర్షాకాలంలో అవస్థలు తప్పడం లేదు. పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆమె వాపోతుంది. సమస్యను పరిష్కరించకుంటే ఇరు కుటుంబాల మధ్య వివాదం ముదిరే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

## మహానందిలో భక్తుల సందడి


దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

మహానంది: వేసవి సెలవులు, ఆదివారం కావడంతో వేలాది మంది భక్తజనంతో మహానంది ఆలయం కిటకిటలాడింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం 5.30 గంటలకు జరిగిన అష్టవిధ మహా మంగళ హారతుల సమయం నుంచి రాత్రి 9.30 గంటల వరకు దర్శనం నిర్విరామంగా కొనసాగింది.

**ఓంకారంలో భక్తజన సందడి**

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవులు ఉండటంతో పలు ప్రాంతాల భక్తులు వేలాది సంఖ్యలో ఆలయానికి వచ్చారు. భక్తులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని శ్రీ వేంకటేశ్వరస్వామి, ఉప ఆలయాలను సందర్శించారు. పూజల అనంతరం భక్తులు శ్రీ కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అన్నప్రసాదాలు స్వీకరించారు.

### మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో శ్రీశైలం ఎన్నికల అబ్జర్వర్, ఐఆర్ఎస్ అధికారి భగవత్ కిషోర్ మిశ్రా దంపతులు ఆదివారం మహానందికి వచ్చారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు.


మహానందీశ్వరుడి దర్శనార్థం ఎన్నికల అబ్జర్వర్, భగవత్ కిషోర్ మిశ్రా

## బుడ్డలాకుకు భలే గిరాకీ

దొర్నిపాడు: బుడ్డలాకు పశువులకు భలే రుచికరం అంటున్నారు రైతులు. ఇక్కడి పల్లెల్లో వేరుశనగ ఆకును బుడ్డలాకు అని పిలుస్తారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో కుందూనది కింద రైతులు వేరుశనగ పంట సాగు చేసి ఇటీవల పంటను నూర్పిడి చేశారు. ప్రస్తుతం వేరుశనగ కట్టెకు డిమాండ్ నెలకొంది. ఎకరం సుమారు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ధర పలుకుతోంది. వేసవిలో లభించే ఆకు రుచికరంగా ఉంటుందని దీంతో పాడి గేదెల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందని పోషకులు చెబుతున్నారు. ఇక ఎద్దులకు మంచి సత్తువ వస్తుందని అందుకే బుడ్డలాకుకు భలే గిరాకీ ఉంటుదని రైతులు పేర్కొంటున్నారు.


ట్రాక్టరుకు ఎత్తుతున్న వేరుశనగ కట్టె




టీ.లింగందిన్నె మెట్ట సమీపంలో స్వయంభువుగా వెలసిన లింగమయ్య స్వామి, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్, టి.లింగందిన్నె మెట్ట నుంచి ఆలయం వరకు వేసిన సీసీ రోడ్డు, ఇరువైపులా చెట్లు

## ఆహ్లాదకరం.. లింగమయ్య సన్నిధి

- నాడు వసతులు లేక వెల వెల
- దాతల సహకారంతో మెరుగుబడిన సౌకర్యాలు
- పెరిగిన భక్తుల సంఖ్య
- పూర్వ వైభవం సొంతం చేసుకున్న ఆలయం


నూతనంగా నిర్మించిన స్వామివారి ఆలయ గోపురం

రుద్రవరం: మండలంలోని టి.లింగదిన్నె మెట్ట నుంచి కి.మి దూరంలో దాదాపు 400 ఏళ్ల క్రితం స్వయంభువుగా లింగమయ్య స్వామి వెలిశారు. అప్పట్లో ప్రతి ఆదివారం వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామి వారికి పూజలు చేసేవారు. కొలిచే వారి కోర్కెలు తీర్చే స్వామిగా పేరు గడించారు. దీంతో స్థానికులతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చేవారు. కాలక్రమేణా వసతులు కొరవడటంతో భక్తుల నుంచి ఆదరణ తగ్గింది. దీంతో ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. కొన్నేళ్ల నుంచి పూర్వ వైభవం చోటు చేసుకుంది. ముత్తలూరుకు చెందిన శంకర్ రెడ్డి, నంద్యాలకు చెందిన లింగమయ్య ముందకు వచ్చి సొంత నిధులు, దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టారు. మందుగా స్వామి వారికి ఆలయం, గోపురం నిర్మించడంతో భక్తుల సంఖ్య పెరిగింది. వసతులు పెరగడంతో పదుల సంఖ్యలో ఉన్న భక్తుల సంఖ్య వేలకు చేరుకొని ఆదాయం పెరగసాగింది. ఆ సొమ్ముతో భక్తులు బస చేసేందుకు గదులు, శుభకార్యాలు చేసుకునేందుకు షెడ్డు నిర్మించారు. అలాగే క్షేత్ర పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించడంతో ప్రస్తుతం చెట్ల పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. భక్తాదుల కోసం కొంత పొలం కొనుగోలు చేసి అన్ని రకాల పండ్ల మొక్కలను నాటారు. ఇటీవల ఆలయ ప్రాంగణంలో రూ.6.5 లక్షలు వెచ్చించి స్విమ్మింగ్ పూల్ నిర్మించారు. వేసవి కావడంతో సేదదీరేందుకు, ఈత నేర్చుకునేందుకు పిల్లలు, పెద్దలు భారీగా వస్తున్నారు. గతంలో టి. లింగందిన్నె నుంచి ఆలయం వరకు రోడ్డు సౌకర్యం లేదు. ప్రస్తుతం సీసీ రోడ్లు వేయించి ఇరువైపులా చెట్లతో ఆకట్టుకుంటోంది. భక్తులు సేదతీరాక స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.